క్లుప్తంగా

పట్టపగలే టెలిఫోన్ కేబుళ్ల చోరీకి యత్నం



దొంగలు తవ్విన గోతులను కప్పుతున్న వ్యాపారులు

మామిడికుదురు: పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్‌లో పట్ట పగలు టెలిఫోన్ కేబుల్ వైర్ల చోరీకి యత్నించిన సంఘటన కలకలం రేపింది. భూమిలో పాతిన కేబుల్ వైర్లను దర్జాగా వచ్చి తవ్వి తీసేందుకు ప్రయత్నిస్తుండగా టెలికామ్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజోలు మండలం పొన్నమండలో ఇదే తరహాలో టెలికామ్ శాఖకు చెందిన కేబుల్ వైర్లను చోరీ చేశారని చెబుతున్నారు. అక్కడ సంఘటన నేపథ్యంలో కేబుల్ వైర్ల కోసం తవ్వుతున్న మహిళలను సంబంధిత శాఖ అధికారులు పోలీసులకు అప్పగించారు. దీనిపై విశారణ చేస్తున్నామని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ శనివారం తెలిపారు.

తాచుపాము హల్‌చల్



అంబాజీపేటలో తాచు పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ వర్మ

అంబాజీపేట: స్థానిక డైలీ మార్కెట్ రోడ్డులో తాచుపాము హల్‌చల్ చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అప్పన కాశీ ప్రసాద్ కొబ్బరి గొడౌన్‌లో తాచు పాము కనిపించడంతో స్థానికులు భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. దాంతో వర్మ తాచుపామును చాకచక్యంగా పట్టుకుని డబ్బాలు బంధించారు. జన సంచారం లేని ప్రాంతంలో తాచు పామును వదిలిపెట్టారు.

పోతవరంలో...

పి.గన్నవరం: పోతవరం గ్రామంలో శనివారం ఒక తాచుపాము హల్‌చల్ చేసింది. సూర్య గార్డెన్స్‌లో ఉంటున్న లైన్‌మెన్ మట్టపర్తి సత్తిబాబు ఇంట్లో కనిపించింది. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు హడలిపోయి బయటకు పరుగులు తీశారు. తర్వాత స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం అందించగా, తాచుపామును చాకచక్యంగా పట్టుకున్నాడు.

రోడ్డు పనులు ప్రారంభం

మామిడికుదురు: గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు అభివృద్ధి పనులను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. పాశర్లపూడి చింతలమెరక నుంచి పాశర్లపూడిలంక వరకు రోడ్డును సిమెంట్ కాంక్రీట్ రోడ్డుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, ఎంపీటీసీ నెల్లి దుర్గాప్రసాద్, నగరం ఏఎంసీ మాజీ చైర్మన్ ఖొండలరావు, నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రిపబ్లిక్ డే విన్యాసాలు



మామిడికుదురులో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

మామిడికుదురు: గ్రామంలో శనివారం విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భారతమాత వేషధారణలో త్రివర్ణ పతాకంతో విద్యార్థిని మధ్యలో నిలబడగా ఆమె చుట్టూ వలయాకారంలో మూడు రంగుల వర్ణాల చీరలతో విద్యార్థులు అలరించారు. దేశభక్తి గీతాలు ఆలపిస్తూ ఆకట్టుకున్నారు. డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో యక్కలదేవర నాగన్నబాబు పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.

బాలల సంరక్షణపై అవగాహన

సఖినేటిపల్లి: బాలల హక్కులు, వారి రక్షణపై అవగాహన పెంచుకోవాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ బి.పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. శనివారం అంతర్వేది దేవస్థానం గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌ను ఆమె సందర్శించారు. కేంద్రంలో చిన్నారులకు నిర్దేశించిన పోషకాహార ప్యాకెట్లను వారి తల్లులకు, ఆమె పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనిషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈఓగా కృష్ణ బాధ్యతల స్వీకరణ

ఆలమూరు: మండలంలోని నవాబుపేట, జొన్నాడ, పెనికేరు గ్రామాల్లో ఉన్న దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల కార్యనిర్వాహణాధికారిగా ఎంఎస్ఆర్ కృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మూలస్థాన అగ్రహారంలోని పార్వతి సమేత మూలేశ్వరస్వామి ఆలయ ఈఓగా పనిచేస్తున్న కృష్ణకు అదనంగా ఆ మూడు గ్రామాల దేవాలయాలను అప్పగించారు.

వ్యాసరచన పోటీ విజేతలు

మలికిపురం: స్థానిక ఎంఈవో కార్యాలయంలో శనివారం మండల స్థాయిలో ఓటు విలువపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విజేతలు వివరాలను రామరాజులంక గెజిటెడ్ హెచ్ఎం కేవీఆర్ఎస్ లక్ష్మి తెలిపారు. ప్రథమ స్థానంలో రామరాజులంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.గౌరీ రత్నం, ద్వితీయ స్థానంలో కేశనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కేకేఎన్ ప్రశాంతి కుమారి, తృతీయ స్థానంలో రామరాజులంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఏఎస్‌వీ నగేష్ నిలిచారు.

మహమ్మారిని తరిమేద్దాం

- గ్రామాల్లో కుష్టువ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు
- అందుబాటులో ఉన్న బహుళ ఔషధ చికిత్స
- రోగుల సంఖ్య తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు



పెదపళ్లలో కుష్టు వ్యాధి నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



కుష్టువ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలను వివరిస్తున్న వైద్య సిబ్బంది

అలమూరు: ఆరోగ్యమే మహాభాగ్యం. సంపూర్ణ ఆరోగ్య సాధనే ప్రతి ఒక్కరి లక్ష్యం. వంశ పారపర్యంతో కాని ప్రకృతి ప్రభావిత అంశాల వల్ల కానీ మానసిక, శారీరక సమస్యలు సంభవిస్తుంటాయి. వాటిని సకాలంలో గుర్తించి తగిన చికిత్స అందిస్తే ఎంతటి దీర్ఘకాలిక వ్యాధులైనా నివారించవచ్చు. అలాంటిదే కుష్టు వ్యాధి. ఈ వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టడంతో చక్కని ఫలితాలు లభిస్తున్నాయి.

వ్యాధిగ్రస్తులను గుర్తిస్తూ..

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వాలు కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాయి. ఈనెల 20న ప్రారంభమైన పక్షోత్సవాలు వచ్చే నెల రెండో తేదీ వరకూ కొనసాగనున్నాయి. దీనిలో భాగంగా ఇప్పటికే వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి శరీరంపై అనుమానిత మచ్చలు ఉన్న వారిని గుర్తించి వ్యాధి నిర్ధారణ చేపట్టారు. వ్యాధి లక్షణాలున్న వారికి అధునాతనమైన బహుళ ఔషధ చికిత్స (ఎంటీఎం)ను అందిస్తూ కుష్టు వ్యాధి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా వైద్యారోగ్య సిబ్బంది కృషి చేస్తున్నారు. రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో ఉన్న 21 పీహెచ్‌సీల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. వైద్య సిబ్బంది ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఇప్పటి వరకూ 284 మందిని గుర్తించారు. ఈ రోగులకు ప్రతి నెలా మొదటి వారం కుష్టు వ్యాధి నివారణ బృందం వచ్చి చికిత్సను అందిస్తుంది. రోగులు త్వరితగతిన కోలుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

బహుళ ఔషధ చికిత్సతో వ్యాధి దూరం

మైక్రో బ్యాక్టీరియా ప్రభావంతో ఈ కుష్టు వ్యాధి సోకుతుంది. శరీరంపై రాజరంగు మచ్చలొస్తాయి. ఆ మచ్చల ప్రదేశంలో వెంట్రుకలు రాలిపోతాయి. అటువంటి మచ్చలపై దురద, స్పర్శ, నొప్పి ఉండవు. ఈ ప్రారంభ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆశ, ఏఎన్ఎంలకు తెలియజేయాలి. వ్యాధి నిర్ధారణ అయితే బహుళ ఔషధ చికిత్సను అందించడంతో పాటు వ్యాధి తీవ్రత తగ్గే వరకూ రోగికి చికిత్స పరంగా అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తారు. వ్యాధిగ్రస్తులు మానసికంగా ధృడంగా ఉండేలా కౌన్సిలింగ్ ఇస్తారు. వ్యాధి నియంత్రణపై వారికి భరోసా కల్పిస్తారు. వుండ్లు ఉన్నవారికి అవసరాన్ని బట్టి కత్తిపూడిలోని రిఫరల్ లెప్రసీ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేస్తారు. చికిత్స చేయించుకునే సమయంలో రోగికి రూ.ఎనిమిది వేలు పారితోషికాన్ని కూడా అందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యాధిగ్రస్తులకు రూ.మూడు వేలు పింఛను, నెలకు 35 కిలోల బియ్యం అందిస్తుంది.

కుష్టువ్యాధి లక్షణాలు

- చర్మంపై స్పర్శ లేని మచ్చలు ఉండడం, శరీరంపై మెరిసే రీతిలో జిడ్డుగల ఉబ్బెత్తుగా ఉండే చర్మం, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బొడిపెలు కనిపిస్తాయి.
- కనురెప్పలు మూతపడక పోవడం, ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం, కాళ్లు చేతులు తిమ్మిర్లు రావడం, జోములు కలిగి ఉండడం వంటివి కనిపిస్తాయి.
- చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతుల నుంచి వస్తువులు తరచూ జారి పోవడం, కాళ్లలో స్పర్శ కోల్పోయి పాదరక్షలు జారి పడిపోవడం, తెలియకుండానే కాళ్లు, చేతులపై బొబ్బలు రావడం, చేతి, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగ వైకల్యం రావడం వంటివి ఈ వ్యాధి లక్షణాలు. ఇవి కనిపించిన వెంటనే దగ్గరగా ఉన్న ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి.

వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ప్రత్యేక కార్యాచరణ



కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు వైద్యారోగ్య సిబ్బంది చేపట్టిన ఇంటింటి వెళ్లి వ్యాధి లక్షణాలు వివరిస్తున్న కార్యక్రమం చురుగ్గా జరుగుతుంది. చిన్నారుల శరీరాలను పరీక్షించి మచ్చలు ఉన్నట్లయితే సంబంధిత వైద్య నిపుణులకు నివేదిస్తున్నాం. పీహెచ్‌సీ స్థాయిలో వైద్యాధికారి, డివిజన్ స్థాయిలో డీపీఎంఓ స్థాయి అధికారి షెడ్యూల్ ప్రకారం పీహెచ్‌సీల్లో పర్యటిస్తూ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.

ఏవీవీ.రాజా అక్కుల, హెల్త్ ఎడ్యుకేటర్, పీహెచ్‌సీ పెదపళ్ల.

కుష్టువ్యాధిపై అపోహలొద్దు



కుష్టువ్యాధి పట్ల అపోహలు వీడాలి. వ్యాధి లక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించాలి. పాఠశాలలు, క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నాం. కుష్టు ఒకరి నుంచి మరొకరికి సంక్రమించదు. ప్రభుత్వం క్రమం తప్పకుండా సర్వే, చికిత్స, ప్రభుత్వ సాయాన్ని అందిస్తుంది.

– డి.సువర్చలాదేవి, వైద్యాధికారి, పీహెచ్‌సీ, చొప్పెల్ల

జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

అంబాజీపేట: కోనసీమ క్రీడోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో తొండవరం బాలికలు ప్రతిభ కనబర్చి, ప్రథమ స్థానంలో నిలిచినట్టు హెచ్ఎం పీవీ కేశవాచార్యులు, పీడీ పెచ్చెట్టి సూర్యనారాయణ తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో క్రీడాకారులను శనివారం అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు కోనసీమ క్రీడోత్సవాలను నిర్వహించారన్నారు. ఖోఖో పోటీల్లో బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి ట్రోఫీని కైవసం చేసుకున్నారన్నారు. క్రీడాకారులను తీర్చిదిద్దిన పీడీ సూర్యనారాయణను, క్రీడాకారులను ఎస్ఎంసీ చైర్మన్ పి.వెంకట సుబ్బారావు, ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, ఎంపీపీ డి.వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బి.వరలక్ష్మి, సర్పంచ్ పేరాబత్తుల రామలింగరాజు (దొరబాబు), ఎంపీటీసీ వి.దొరబాబు, స్టాఫ్ సెక్రటరీ ఎం.రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యక్తి అరెస్టు

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పలివెల గ్రామానికి చెందిన పెండ్రాళ్ల వీర్రాజు అనే వ్యక్తిని అరెస్టు చేసి, తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ కే కాత్యాయని శనివారం తెలిపారు. నిందితుడిని మేజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు తెలిపారు.

గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు



లూటుకుర్రులో రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందిస్తున్న సర్పంచ్ తాతకాపు

మామిడికుదురు: మండలంలోని లూటుకుర్రు, మాకనపాలెం గ్రామాల్లో శనివారం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాలను సర్పంచులు అడబాల తాతకాపు, మద్దాల బాబూరావు, ఎంపీటీసీలు నామన వెంకటేశ్వరరావు వలవల పెదబాబు ప్రారంభించారు. జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి కె.వెంకట్రావు పర్యవేక్షణలో మండల పశు వైద్యాధికారి సీహెచ్ శ్రీరామ్ ఆధ్వర్యంలో పాడి పశువులకు చూడి పరీక్షలు, గర్భ కోశ పరీక్షలు, నట్టల నివారణ మందులు అందించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు కె.మురళీకృష్ణ, సూర్యనారాయణరాజు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం పంచాయతీ వద్ద శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సర్పంచ్ మేడిద సరోజ ప్రారంభించారు. రైతులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులకు గాలికుంట వ్యాధి రాకుండా మందులను ఆమె రైతులకు అందజేశారు. కాగా పలు వ్యాధుల నివారణకు టీకాలను వెటర్నరీ సిబ్బంది పశువులకు వేశారు. ఉండపల్లి అంజి, యెనుముల తాతాజీ, ఆచంట మహేష్, కడలి సత్యనారాయణ, చిట్టూరి విష్ణు పాల్గొన్నారు.

అంబాజీపేట: పాడి రైతులు మెలకువలు పాటించి పశువుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకోవాలని పశువైద్యాధికారి జి.శ్రీనివాస్ సూచించారు. మాచవరంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన పశువైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, నాగాబత్తుల సుబ్బారావు, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, దొమ్మేటి సాయికృష్ణ, కొప్పినీడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఓటుకు మించిన ఆయుధం లేదు

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- సీనియర్ సిటిజన్లకు సత్కారం
- పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలు



పి.గన్నవరంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



అంతర్వేదిపాలెం పాఠశాల వద్ద ముగ్గుల పోటీల్లో విజేతకు బహుమతి ఇస్తున్న సర్పంచ్ లీలావతి



విద్యార్థులు వేసిన ఓటరు దినోత్సవ లోగో



కొత్తపేటలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, ఆర్డీఓ శ్రీకర్ తదితరులు

కొత్తపేట: ప్రజాస్వామ్యంలో ఓటుకు మించిన ఆయుధం మరొకటి లేదని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ పీ శ్రీకర్ పర్యవేక్షణలో తహసీల్దార్ వై రాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్డీఓ అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీనియర్ ఓటర్లను ఎమ్మెల్యే, ఆర్డీఓ ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు సుబ్బరాయశాస్త్రి, పంచాయతీ సభ్యుడు మారుతీప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతకలు బహుమతులు అందజేశారు. సీనియర్ సిటిజన్లను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక రావులపాడు యూపీ స్కూల్ ఆవరణలో సర్పంచ్ సత్యదేవి ఆధ్వర్యంలో శనివారం ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. ఓటరు దినోత్సవం లోగో ఆవిష్కరించారు.

అంబాజీపేట: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని, ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యతని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ జి.వెంకటేశ్వరి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆర్ఐ ఏడుకొండలు అధ్యక్షతన జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. సీనియర్ సిటిజన్ సాధనాల జానకిరామయ్యను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం కడలి సాయిరామ్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో నిర్వహించిన ఓటర్ల దినోత్సవ వేడుకలు సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవానీల ఆధ్వర్యంలో నిర్వహించారు.

మామిడికుదురు: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులు పేర్కొన్నారు. మామిడికుదురు దీప్తి విద్యా సంస్థల ప్రాంగణం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకూ విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో డిప్యూటీ ఎమ్మార్వో శరణ్యతో కలిసి ఆయన పాల్గొన్నారు. మామిడికుదురు, నగరం, లూటుకుర్రు, ఈదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు జాలెం రమణకుమారి, అడబాల తాతకాపు, చుట్టుగుళ్ల లక్ష్మి, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలని జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మణరావు అన్నారు. తహసీల్దార్ పి.పల్లవి ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని స్థానిక గ్రేస్ కళాశాల వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ కె.వి జయప్రసాద్, ఆర్ఐ వై.వర్మ, సర్పంచ్ బొండాడ నాగమణి, కళాశాల కరస్పాండెంట్ నల్లి శ్రీచరణ్, ప్రిన్సిపాల్ పీవీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం జెడ్పీ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం స్థానిక రెవెన్యూ శాఖ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఎంపీటీసీలు మందపాటి రత్నం, కోనపల్లి భవాని, వీఆర్వోలు ఇంటి హరి దుర్గాప్రసాద్, తోట వెంకట సత్యనారాయణ, నాయకులు నల్లి సురేంద్ర, ఈద రవిరెడ్డి, వీరా కర్ణుడు, వాడపల్లి రాంబాబు, నాయకులు పాల్గొన్నారు. కేశవదాసుపాలెంలో వీఆర్వో నాగరాజు ఆధ్వర్యంలో ఓటు హక్కుపై బాధ్యతగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. వివిధ పోటీల్లోని విజేతలకు సర్టిఫికెట్లు సర్పంచ్ మేడిద సరోజ అందజేశారు.

ఆలమూరు : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని దేశ సామరస్యతను, సార్వభౌమత్వాన్ని కాపాడాలని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో తహసీల్దార్ కె.జె.ప్రకాష్ బాబు, డిప్యూటీ తహసీల్దార్ టి.సుబ్బరాజు ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ రాజు, సూపరింటెండెంట్ ప్రకాష్, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొత్తపేట: కొత్తపేటలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఓటు విలువను నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. మండల విద్యా శాఖాధికారులు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజోలు: ఓటు హక్కు పౌరుల బాధ్యత అని రాజోలు నియోజకవర్గ ఎన్నికల అధికారి, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు, విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను ఎన్నికల అధికారి శివశంకర్ ఆధ్వర్యంలో సత్కరించారు.

అంబాజీపేట: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని తొండవరం హైస్కూల్‌లో ఎన్నికల కోలాహల వాతావరణం ఏర్పడింది. పాఠశాలోని విద్యార్థులకు సార్వత్రిక ఎన్నికలపై అవగాహన కల్పించడంలో భాగంగా విద్యార్థులకు ప్రత్యక్షంగా ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన ఎన్నికల అధికారిగా ప్రధానోపాధ్యాయులు పి.వి.కేశవాచార్యులు వ్యవహరించగా, రిటర్నింగ్ అధికారులుగా సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు గంటి శ్రీనివాస్, మట్టపర్తి రాంబాబు వ్యవహరించారు.

అయినవిల్లి: ఓటు హక్కును 18 సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ కోరారు. గ్రామంలోని ముక్తేశ్వరం ఎస్.ఎన్.వీ.ఆర్ జూనియర్ కళాశాలలో తహసీల్దార్ సీహెచ్ నాగ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, అధ్యపకులు, అధ్యపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది



మామిడికుదురులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ ఆచార్యులు



అంబాజీపేటలో సీనియర్ సిటిజన్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, తహసీల్దార్



ఆలమూరులో సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

తహసీల్దార్ రాంబాబుకు రాష్ట్ర ఉత్తమ సేవా అవార్డు



విజయవాడలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ ద్వారా అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ రాంబాబు

కొత్తపేట: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తపేట తహసీల్దార్, సహాయ ఓటర్ల నమోదు అధికారి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి తహసీల్దార్ రాంబాబును ఉత్తమ ఎన్నికల నిర్వహణ అధికారిగా ఎంపిక చేశారు. ఆ మేరకు శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమెంటో అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఆర్డీఓ పీ శ్రీకర్, జిల్లా, డివిజన్, మండల స్థాయి రెవెన్యూ అధికారులు, సిబ్బంది రాష్ట్ర అవార్డు గ్రహీత రాంబాబును అభినందించారు.

డిగ్రీ కళాశాలలో వుమెన్స్ హాస్టల్ భవనం ప్రారంభం

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రూ.60 లక్షల యూజీసీ నిధులతో నిర్మించిన వుమెన్స్ హాస్టల్ భవనాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు చావలి సుబ్బరాయశాస్త్రి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు, వైస్ ప్రిన్సిపాల్ టి రమాదేవి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం తరుపున చేయాల్సిన కృషి చేస్తానని ఎమ్మెల్యే సత్యానందరావు అన్నారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్, సర్పంచ్ బూసి జయలక్ష్మి, కమిటీ సభ్యులు కంఠంశెట్టి శ్రీనివాసరావు, పల్లికొండ సుధీర్‌కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

కల్యాణ ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



అంతర్వేదిలో కల్యాణ వేదిక వద్ద ఏర్పాట్ల గురించి ఆర్డీవోకు వివరిస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: వచ్చే నెల నాలుగో తేదీ నుంచి 13వ తేదీ వరకూ అంతర్వేది క్షేత్రంలో నిర్వహించనున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం కల్యాణ ఉత్సవ ఏర్పాట్లను అమలాపురం ఆర్డీవో కె.మాధవి పరిశీలన చేశారు. తొలుత తీర్థంలో దేవస్థానం చేపడుతున్న భక్తుల సౌకర్యాలు గురించి అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆర్డీవోకు వివరించారు. ఆలయానికి ఉత్తరం వైపున స్వామివారి తెప్పోత్సవానికి ప్రత్యామ్నాయ చెరువు ఏర్పాట్లను పరిశీలించారు. కల్యాణ వేదిక, భక్తుల, వీఐపీల గ్యాలరీలు ఏర్పాట్లపై ఆరా తీశారు. దేవాలయంలో వీఐపీ, శ్రీఘ్ర, సాధారణ దర్శనాలకు మూడు క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వీటితో పాటు తీర్థంలో ఆయా శాఖల ద్వారా భక్తులకు ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు గురించి కూడా ఆర్డీవో అధికారులకు సూచనలు చేశారు. డిప్యూటీ తహసీల్దారు సీహెచ్ భాస్కర్, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ బాలాజీ, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.సూర్యనారాయణ, వీఆర్వోలు సీతారామం, ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.


వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

ఆలమూరు: గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నల్లచెరువులో

అయినవిల్లి: నల్లచెరువు గ్రామంలో వేంచేసి ఉన్న అలిమేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. వేదపండితుల స్వామికి ప్రత్యేక పూజలు, తులసీ పూజ చేశారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు.

గోదావరి బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



రావులపాలెం: స్థానిక గౌతమీ గోదావరి బ్రిడ్జి సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. రావులపాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుడి వయసు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని టౌన్ సీఐ శేఖరబాబు తెలిపారు. ఎరుపు రంగు చొక్కా లోపల అపోలో టైర్ల కంపెనీ టీషర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంటి తెలిపారు.